## క్లుప్తంగా

### వైభవంగా విశ్వేశ్వరుని కల్యాణం



**పాత గుంటూరు:** బ్రాడీపేట రెండోలైనులోని శ్రీగౌరీ విశ్వేశ్వరాలయంలో మంగళవారం స్వామి జన్మనక్షత్రం సందర్భంగా దివ్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. జంధ్యాల పవన్‌కుమార్ శర్మ, వెంకటలక్ష్మి, మిట్టపల్లి అయ్యప్ప చక్రవర్తి, లక్ష్మీ ప్రశాంతి దంపతులతో అర్చకులు విశ్వేశ్వర శర్మ శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సుబ్రహ్మణ్య శాస్త్రి, మల్లికార్జున శర్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### 76మందికి కంటి పరీక్షలు



**ఫిరంగిపురం:** మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని సచివాలయం వద్ద డాక్టర్ వైఎస్సార్ కంటివెలుగు పరీక్షలు మంగళవారం నిర్వహించారు. నేత్ర వైద్య నిపుణురాలు రోజారాణి 76మందికి కంటిపరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ 35మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. 16మందిని కంటి ఆపరేషన్ల కోసం గుంటూరు వైద్యశాలకు రిఫర్ చేశామన్నారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వం పేద ప్రజల కోసం డాక్టర్ వైఎస్సార్ కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటిని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, బాబురావు, ఏఎస్ఎం ఆంతోనిరాణి, ఆశాకార్యకర్తలు సుజాత, జోజమ్మ, పద్మ, శాంతరాణి, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

### బీసీలకు అత్యధిక స్థానాలు కేటాయించాలి

**నెహ్రూనగర్:** ఏ రాజకీయ పార్టీ అయినా బీసీలకు ప్రతి పార్లమెంట్ సెగ్మెంట్‌లో మూడు స్థానాలు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారే తప్ప వారికి చేసిందేమి లేదని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికలలో బీసీలకు ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మూడు స్థానాలు కేటాయించాలని, లేకుంటే బీసీలను ఏకగ్రీవంగా నిలబెట్టి గెలిపించుకుంటామని వివరించారు.

### ఉద్యోగోన్నతుల్లో న్యాయం చేయాలి

**గుంటూరు ఎడ్యుకేషన్:** గతేడాది జరిగిన ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్‌లో భాగంగా ఉద్యోగోన్నతికి విల్లింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత ఉపాధ్యాయులకు ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా నెలకు రూ.2,500 అలవెన్సు ఇస్తామని చెప్పి, ఐదు నెలలు పని చేసిన తరువాత ఉద్యోగోన్నతులను రద్దు చేయడం అన్యాయమని పేర్కొన్నారు.

### ఉపాధ్యాయ బదిలీల్లో అసంబద్ధ నిర్ణయాలను సవరించాలి

**గుంటూరు ఎడ్యుకేషన్:** ఉపాధ్యాయ బదిలీ నిబంధనల్లో అసంబద్ధ నిర్ణయాలను సవరించాలని ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సీహెచ్ జోసఫ్ సుధీర్ బాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో సంఘ గుంటూరు జిల్లా అధ్యక్షుడు గేరా మోహనరావు అధ్యక్షతన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులపై నిర్వహించిన ఎస్టీయూ ముఖ్య నాయకుల సమావేశంలో ముఖ్యఅతిథిగా జోసఫ్ సుధీర్ బాబు మాట్లాడుతూ ప్రమోషన్లు, బదిలీల విషయంలో విద్యాశాఖ వైఖరి, జారీ చేస్తున్న ఉత్తర్వులు ఉపాధ్యాయులను ఆందోళనకు గురి చేస్తున్నాయని పేర్కొన్నారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు ఆర్థిక కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు, నాయకులు డీఏ జోసెఫ్, పేరేచర్ల శ్రీనివాసరావు జి.జోజప్ప, వై.శ్యాంబాబు, కేవీ రమణ, ఎం.శ్రీనివాసరావు, రహంతుల్లా పాల్గొన్నారు.

### డాక్టర్ రాజేంద్రప్రసాద్‌కు బయోడైవర్సిటీ కన్సర్వేటర్ అవార్డు

**పాత గుంటూరు:** డాక్టర్ పట్టాభి కళాపీఠం, నవ్యాంధ్ర రచయితల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వ బయో డైవర్సిటీ బోర్డు( జీవన వైవిధ్య మండలి) ఏటా అందించే బయో డైవర్సిటీ కన్సర్వేటర్ అవార్డును అందుకున్నారు. సోమవారం తిరుపతి పశువైద్య విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బోర్డు చైర్మన్ డాక్టర్ బి.ఎం.కె. రెడ్డి, డాక్టర్ కె. గోపీనాథ్, వెటర్నరీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.రవి నుంచి రాజేంద్రప్రసాద్ అవార్డును అందుకున్నారు. రాజేంద్రప్రసాద్ పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్నందుకు ఈ అవార్డు దక్కింది. ఆయనకు అవార్డు దక్కడంపై పలువురు రచయితలు, సాహిత్యాభిమానులు అభినందనలు తెలిపారు.

# పేదలకు స్థలమిస్తే సామాజిక అసమతుల్యత దెబ్బతీయడమా?

- ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్
- తాతిరెడ్డిపాలెంలో అర్బన్ లే అవుట్ పరిశీలన

**తాడికొండ:** అమరావతిలో పేదలకు స్థలాలు ఇవ్వడం సామాజిక అసమతుల్యత దెబ్బతీయడం అని చంద్రబాబు మాట్లాడటం నయా అంటరానితనానికి తెరలేపినట్లు ఉందని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ అన్నారు. పేదలకు సెంటు స్థలం ఇవ్వడంపై చంద్రబాబు సమాధితో పోల్చడాన్ని నిరసిస్తూ తాడికొండ మండలం తాతిరెడ్డిపాలెం అర్బన్ లే అవుట్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడిన ఆయన సెంటు స్థలంలో ఇంటి నిర్మాణం ఎలా ఉందంటూ ఆరా తీయగా వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబుకు పేదలంటే అంటరాని వారిలా సూచించేలా మాట్లాడుతున్న మాటలు దుర్మార్గమన్నారు. పేదలు ఎప్పటికీ పేదలుగా ఉండిపోవాలని నయా అంటరానితనం, నయా పెత్తందారీ భావజాలానికి ఆయన తెరదీశారని, కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం పేదలను పేదరికం నుంచి బయట పడేసి వారికి ఆర్థిక పరిపుష్టిని కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో 35 లక్షల ఇళ్ల స్థలాలిచ్చిన ఏకైక ప్రభుత్వం భారతదేశంలో ఏదైనా ఉందంటే అది ఒక్క వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని, పేదలకు రాజధానిలో చోటు కల్పించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైనదన్నారు. గతంలో చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ, బీసీలను కించపరుస్తూ ఎస్సీ కులాల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా, బీసీల తోకలు కత్తిరిస్తామని వ్యాఖ్యానించడం ఆయన పక్షపాత వైఖరికి నిదర్శనమన్నారు. చంద్రబాబు పేదల ఇళ్ల స్థలాలపై చేసిన వ్యాఖ్యలపై ప్రజలకు వెంటనే సమాధానం చెప్పాలన్నారు.



తాతిరెడ్డిపాలెం అర్బన్ లే అవుట్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

# సీఎం సభను జయప్రదం చేయండి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్

**తాడికొండ:** తుళ్లూరు మండలం వెంకటపాలెం గ్రామంలో ఈ నెల 26న జగరనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. గుంటూరు భారత్‌పేటలోని నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో పేదలకు 50 వేల ఇళ్ల స్థలాలివ్వడం చరిత్రలో నిలిచిపోయే ఘటన అని దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వం చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లడం ద్వారా ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని, ఈ కార్యక్రమం ద్వారా గుర్తించిన సమస్యల తక్షణ పరిష్కారానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నియోజకవర్గస్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్

### విద్యార్థులకు యోగాలో శిక్షణ

**తాడేపల్లిరూరల్:** వేసవి సెలవుల్లో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ తాడేపల్లి శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు యోగాపై శిక్షణ నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి షేక్ నాగూర్ బాషా తెలిపారు. విద్యార్థులకు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జ్ఞాపకశక్తిని పెంచడానికి యోగా, ప్రాణాయామం ఎంతో ముఖ్యమని, పిల్లలు ప్రతి రోజూ ఉదయాన్నే యోగా, ప్రాణాయామం చేయాలని వివరించారు. కుంచనపల్లి హైస్కూల్‌కు చెందిన యోగా మాస్టర్ బి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఉదయం 30 నిమిషాల పాటు యోగా, ప్రాణాయామం క్లాసులు నిర్వహిస్తున్నామని, ఖాళీ సమయాల్లో విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి మంచి పుస్తకాలను చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు.

### అమరావతి కరకట్ట వెంబడి జంగిల్ క్లియరెన్స్

**తాడేపల్లిరూరల్:** మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి మంగళవారం జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. ఈనెల 26వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ షెడ్యూలు ఖరారు కావడంతో కార్పొరేషన్ అధికారులు జంగిల్ క్లియరెన్స్ చేపట్టినట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

# ఆదర్శప్రాయుడు వల్లభనేని

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**తాడేపల్లిరూరల్:** నేటి తరం కమ్యూనిస్టులకు వల్లభనేని సాంబశివరావు ఆదర్శప్రాయుడని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. దుగ్గిరాల మండలం తుమ్మపూడి గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు వల్లభనేని సాంబశివరావు (71) సోమవారం రాత్రి మృతి చెందిన విషయం విదితమే. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం వల్లభనేని భౌతికకాయాన్ని సందర్శించి అరుణపతాకాన్ని కప్పి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన మాట్లాడుతూ సాధారణ కుటుంబంలో జన్మించిన వల్లభనేని చిన్నతనం నుంచి ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనేవారని, అంకిత భావంతో ఆదర్శ కమ్యూనిస్టుగా ప్రజలకు సేవలు అందించారని అన్నారు. అనంతరం జరిగిన అంతిమయాత్రలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు అభిమానులు, దుగ్గిరాల మండలంలోని ప్రజలు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.



వల్లభనేని సాంబశివరావు అంతిమయాత్రలో పాల్గొన్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**తాడేపల్లిరూరల్:** తాడేపల్లి రూరల్ పరిధిలోని కొలనుకొండ జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ లారీ యజమాని అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ పైపుల కంపెనీ రోడ్డులో నివాసముండే దేవంగుల రాజు (33)కు టిప్పర్ లారీ ఉంది. గుంటూరులో మట్టితోలకాలు ఉన్నాయంటే తెల్లవారుజామున విజయవాడ నుంచి గుంటూరు జాతీయ రహదారి మీద తన ద్విచక్రవాహనంపై వెళుతున్నాడు. ఇదే సమయంలో కొలనుకొండ వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో దేవంగుల రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య దుర్గా భవానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# విద్యార్థులకు పలు రంగాల్లో శిక్షణ

**తాడేపల్లిరూరల్:** నగర పాలక సంస్థ పరిధిలోని పెనుమాక గ్రామంలోని చిగురు బాలల భవన్‌లో హెచ్ఐవీ బాధిత కుటుంబాల విద్యార్థులకు వేసవి శిక్షణా శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు మాట్లాడుతూ బోధన, అభ్యాసం, విద్యార్థుల శక్తి సామర్థ్యాల మెరుగుదలకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కృష్ణకమలం ప్రావీణ్య వికాసం ద్వారా మట్టితో అనేక రూపాలు ఎలా చేయాలో రాజేశ్వరరావు వివరించి చూపించారు. క్రాఫ్ట్ వర్క్ ద్వారా పేపర్‌తో వివిధ కళలను నేర్పించారు. అనంతరం క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, కృష్ణకమలం ప్రావీణ్య వికాసం అధికారి రాజేశ్వరరావు మాట్లాడుతూ క్రాఫ్ట్ కౌన్సిల్ అనేది లాభాపేక్ష లేని సంస్థ అని, హస్తకళలు, చేనేత స్థిరత్వం కోసం పనిచేస్తోందని అన్నారు. శిబిరంలో మట్టి మౌల్డింగ్‌ను నేర్పిస్తున్నామని, కుండల చక్రం, ఉదయగిరి కత్తి పీటల తయారీ, చెరియాల్ ముసుగుల తయారీ, బుట్టలు వేయడం, కొండపల్లి బొమ్మల తయారీ వంటి అనేక రంగాలలో శిక్షణ ఇస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ బి.సుజాత, జోనల్ కో ఆర్డినేటర్ కె.ప్రియాంక, నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్ జె. ఆంజనేయులు, జె.వాణి, సైకాలజిస్ట్ జి.అనూష, డాన్స్ మాస్టర్ నవీన్, వలంటీర్లు హైమావతి, శ్రీనివాసరావు, దుర్గ, రాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు

### 'యాప్'లోన్ తీర్చలేక మరో యువకుడు మృతి..

- గడ్డి మందు తాగడంతో.. రేపల్లె వైద్యశాలలో చికిత్స
- వారం రోజులు మృత్యువుతో పోరాటం..



**రేపల్లె రూరల్:** గడ్డి మందు తాగి యువకుడు మృతి చెందిన ఘటన మైనేనివారి పాలెం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ సురేష్ వివరాల మేరకు నగరం మండలం గొడపాలేనికి చెందిన చెన్ను సాయి(22) కొంతకాలంగా రేపల్లె మండలంలోని మైనేనివారిపాలెంలో తన తండ్రి నాగమల్లేశ్వరరావు వద్ద ఉంటున్నాడు. డిగ్రి పూర్తయిన తర్వాత ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూ ఆన్‌లైన్ యాప్ ఎం పాకెట్ ద్వారా రెండేళ్ల క్రితం రూ.40వేలు లోన్ తీసుకున్నాడు. కొంత కాలంగా ఎం పాకెట్ నిర్వాహకులు తీసుకున్న అప్పు తిరిగి చెల్లించాలని అడుగగా.. డబ్బులు కట్టలేక మనస్తాపం చెంది.. ఈ నెల 16న గడ్డిమందు తాగాడని తెలిపారు. సాయిని రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటి నుంచి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని వివరించారు. తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

# గ్రామ కరదీపికలు వలంటీర్లు

**ఫిరంగిపురం:** గ్రామ కరదీపికలు వలంటీర్లు అని ఎంపీపీ షేక్ షహేలానర్గీస్ అన్నారు. మండలంలోని మేరికపూడి సచివాలయంలో ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లను మంగళవారం సన్మానించారు. ఎంపీపీ షేక్.షహేలానర్గీస్ మాట్లాడుతూ పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని వాటిని ప్రజల్లోకి తీసుకెళుతున్న జగనన్న సైనికులు వలంటీర్లు అని అన్నారు. అటువంటివారిని ప్రభుత్వం అవార్డులతో సన్మానించుకోవడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్క వలంటీర్ జగనన్న సైనికుడిలా పనిచేస్తూ పథకాలను గ్రామస్థాయిలో ముందుకు తీసుకువెళ్లాలని తెలిపారు. అనంతరం బేతపూడి, యర్రగుంట్లపాడు, గుండాలపాడు, మేరికపూడి, పొనుగుపాడు, మునగపాడు గ్రామాలకు చెందిన సేవా వజ్ర, సేవా మిత్ర, సేవా రత్న అందుకున్న 89 మందికి పురస్కారాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూసపాటి మల్లేశ్వరి, వెంకట్రామిరెడ్డి, వీరారెడ్డి, ఎంపీడీవో డి.అనూరాధ, ఉపసర్పంచ్ పద్మావతి, పార్టీ గ్రామ అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు కొల్లి విష్ణువర్ధనరావు, లక్ష్మీశారద, వెంకట్రావు, లలిత, శౌరికుమారి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



అవార్డులు అందుకున్న వారితో ఎంపీపీ షేక్ షహేలానర్గీస్, ఎంపీడీవో అనూరాధ

# ఎన్జీ రంగా వర్సిటీ వీసీకి సన్మానం

**గుంటూరు రూరల్:** ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ పరిశోధన స్థానాలు, కళాశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది, కాంట్రాక్ట్ వర్కర్స్, సెక్యూరిటీ స్వీపర్స్, డ్రైవర్స్, అటెండర్స్ తదితరులకు వేతనాలు పెరిగిన సందర్భంగా మంగళవారం వేడుకలు నిర్వహించారు. నగర శివారుల్లోని లాంఫాంలోని విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాన్ టీచింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీసీ డాక్టర్ ఎ. విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానించారు. వీసీ మాట్లాడుతూ వర్సిటీ వృద్ధికి అందరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎమ్ఎల్ కుమార్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు కె అమ్మిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ జె విజయసారధి, ట్రెజరర్ ఎమ్ నరశింహా, జనరల్ సెక్రటరీ ఆర్ విజయ్‌కుమార్, నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో కమిషనర్ పర్యటన

**తాడేపల్లిరూరల్:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో నగర కమిషనర్ శారదాదేవి అన్ని శాఖల అధికారులతో కలసి మంగళవారం వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తన నివాసం నుంచి ఎన్‌టీఆర్ కరకట్ట మీదుగా బకింగ్‌హామ్ కెనాల్, ఎక్స్ ట్లూయిస్, అమరావతి కట్టమీదుగా వెళ్లనున్నారు. ఈ మార్గంలో ఏమైనా ఆక్రమణలు ఉన్నాయా అనే విషయాన్ని పరిశీలించారు. రెండు మూడు చోట్ల పందిళ్లు ఉన్నట్లు గుర్తించి వాటిని తొలగించాలని సూచించారు. అమరావతి కరకట్ట వెంబడి జంగిల్ క్లియరెన్స్ ప్రారంభించారు. పట్టాల పంపిణీ కార్యక్రమానికి లక్ష మందికిపైగా వస్తారని అంచనా వేస్తున్నామని, వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రహదారులను పరిశీలిస్తున్నామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ హేమమాలిని, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, టౌన్ ప్లానింగ్ ఏసీపీ వెంకటేశ్వర్లు, డీఈ కృష్ణారెడ్డి, ఏఈలు కిషోర్, ప్రవీణ్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సీతానగరంలో రోడ్లను పరిశీలిస్తున్న కమిషనర్ శారదాదేవి, అధికారులు

# చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆర్కే చేయూత

**తాడేపల్లిరూరల్:** దుగ్గిరాల మండల పరిధిలోని చిరు వ్యాపారులకు అండగా ఉంటూ అవసరమైన వారికి తోపుడు బండ్లను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తన సొంత నిధులతో అందజేస్తున్నారు. మండల పరిధిలోని శృంగారపురం గ్రామానికి చెందిన ఉయ్యూరు లక్ష్మి, శృంగారపాటి మేరమ్మ, కొమ్మూరి వాణిమ్మలకు తోపుడు బండ్లను ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్)లు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఉప్పల శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ ఉయ్యూరు నాగేశ్వరి, ఎంపీటీసీ కూచిపూడి సురేష్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు శృంగారంపాటి రత్నం, ఉప్పాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

**తాడేపల్లిరూరల్:** నగర పాలక సంస్థ పరిధిలోని పెనుమాకలో చిరువ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఇరువురు పేదలకు మంగళవారం ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సహాయంతో రెండు టిఫిన్ బండ్లను వైఎస్సార్‌సీపీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పెనుమాక కన్వీనర్ దామేష్‌రెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు బొక్కా నాని, భవనం రవీంద్రరెడ్డి, భుజంగరావు, ప్రభాకర్‌రెడ్డి, అంజిరెడ్డి, అల్లు శ్రీనివాస్‌రెడ్డి, బషీర్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

**తాడేపల్లిరూరల్:** దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరులో చిరు వ్యాపారం చేసుకుంటున్న వారికి ఎమ్మెల్యే ఆర్థిక సహకారంతో తోపుడు బండ్లను మంగళవారం దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపాఫిన, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణలు అందజేశారు. గ్రామంలో కంచర్ల శ్రీనివాసరావు, చిలువూరు సుబ్బారావులకు ప్లాట్‌ఫారం రిక్షాలు, ఆరుమళ్ల మాణిక్యరావు, వడ్డేశ్వరపు చెంచయ్యకు తోపుడు బండ్లు, కంతంరాజు కొండూరు గ్రామంలో గుమ్మడి లాజర్, దానబోయిన శ్రీనివాసరావు, గుడిపూడి శేషయ్యలకు తోపుడు బండ్లను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీసెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ ఉన్నం ఝాన్సీ, ఎంపీటీసీ సభ్యులు షేక్ సుభాని, వైఎస్సార్ సీపీ నాయకులు వడ్డేశ్వరపు రజనీకాంత్, జంషేద్ ఖాన్, సీహెచ్ ఫిలోమినా, వీర వసంతరావు, బుడ్డి, బుల్లిబాబు, కత్తిక శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



తోపుడు బండిని అందజేస్తున్న ఎంపీపీ సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ

# బంగారు ఆభరణాలు మాయం

**తాడేపల్లిరూరల్:** ద్విచక్రవాహనంలో ఉంచి బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బాధితుడు తాడేపల్లి పోలీసులను ఆశ్రయించిన సంఘటన ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం పెనుమాకకు చెందిన శివకృష్ణ తన కుటుంబంతో, తన అక్క కుటుంబంతో కలసి మూడు రోజుల కిందట తాడికొండలోని ఓ వివాహ వేడుకలో పాల్గొనేందుకు వెళ్లారు. వివాహానంతరం శివకృష్ణ భార్య పిల్లలు, అక్క కుటుంబ సభ్యులు కలసి ఆటోలో బయలుదేరారు. శివకృష్ణ తన భార్య వద్ద, పిల్లల వద్ద ఉన్న బంగారు ఆభరణాలను తీసుకుని తన ద్విచక్రవాహనంలో పెట్టుకున్నాడు. తన బావను తీసుకుని పెనుమాక బయలుదేరాడు. మార్గం మధ్యలో పెనుమాక గ్రామ శివారులో మద్యం తాగేందుకు ఆగారు. ఒంట్లో బాగాలేకపోవడంతో టాబ్లెట్లు తీసుకురమ్మని శివకృష్ణ అక్క ఫోన్ చేయడంతో, టాబ్లెట్లు తీసుకుని ఇంటికి వెళ్లమని తన బావకు సూచించాడు. తన ద్విచక్రవాహనాన్ని మరో స్నేహితుడికి ఇచ్చి పంపించాడు. తన స్నేహితుడు వచ్చిన తరువాత అందులో బంగారం కనిపించకపోవడంతో ఆదివారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఆ వ్యక్తిని విచారిస్తున్నారు. పోలీసులు శివకృష్ణను సైతం విచారిస్తున్నారు. ఈ సంఘటనపై ఎస్ఐ రమేష్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అంద లేదని చెప్పడం విశేషం.

# ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

**తాడేపల్లిరూరల్:** ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏపీజీఈఏ దుగ్గిరాల యూనిట్ అధ్యక్షుడు అందె బాలచంద్రమౌళి కోరారు. దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగుల డిమాండ్లతో కూడిన వాల్‌పోస్టర్‌ను ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి మంగళవారం ఆవిష్కరించారు. బాలచంద్రమౌళి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్ బాషా మౌఖిక ఆదేశాల ప్రకారం ఉద్యోగుల సమస్యలపై రానున్న రోజులలో చేపడుతున్న ఉద్యమాలలో ఉద్యోగులు అందరూ ఐక్యంగా కలసి రావాలని కోరారు. ప్రతి నెల 1వ తేదీన జీతాలు చెల్లించేలా చట్టం చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని అన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మెరుగైన జీతాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దమ్ము ఆశీర్వాదమ్మ, హెల్త్ అసిస్టెంట్ సంగెపు శ్రీనివాసరావు, డీఎస్ఎస్ ఆంజనేయశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏపీజీఈఏ దుగ్గిరాల యూనిట్ నాయకులు

# వైభవంగా ఆంజనేయస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**తెనాలిటౌన్:** షరాఫ్ బజార్‌లో వేంచేసియున్న శ్రీ సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం హనుమత్‌సువర్చలా కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వంశ పారంపర్య అర్చకులు ఆర్ శ్రీనివాసమూర్తి నేతృత్వంలో వైదిక క్రతువును అర్చకులు కిరణ్, సురేష్ జరిపారు. తెలుగు పండితులు ములుకుట్ల విశ్వనాథశర్మ ప్రవచనం చేయగా, సంకీర్తన బృందం సభ్యులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.



# సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్ బాష

**తాడికొండ:** ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే నవంబర్ ఒకటి నుంచి నిరవధిక సమ్మె చేపడతామని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్ బాష అన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాడికొండ తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రారంభించిన రిలే నిరాహార దీక్షలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడం వలన ఉద్యోగులు పోరుబాట పట్టారన్నారు. సీపీఎస్ రద్దు, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం వంటి పలు డిమాండ్లు నెరవేర్చాలన్నారు. లేని పక్షంలో నవంబర్ ఒకటి నుంచి నిరవధిక సమ్మెకు వెళతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కేవీఎస్ శివారెడ్డి, నగర శాఖ అధ్యక్షులు వై నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు దక్షిణామూర్తి, రత్తయ్య, తాలూకా యూనిట్ అధ్యక్షులు సుబ్బారావు, కార్యదర్శి సుమిత్రాదేవి, వెంకటేశ్వర్లు, రమణ తదితరులు పాల్గొన్నారు.